## క్లుప్తంగా

### సురేష్‌కు పీస్ ఐకాన్ అవార్డు




పురస్కారం అందుకుంటున్న సాకా సురేష్

**కడియం:** ఇంటర్నేషనల్ వలంటీర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని చెన్నై టి.నగర్‌లోని సోషల్ క్లబ్‌లో ఇటీవల జరిగిన గ్లోబల్ పీస్ సమ్మిట్ 2023లో తనకు పీస్ ఐకాన్ ఇంటర్నేషనల్ 2023 అవార్డును అందజేశారని సాకా సురేష్ తెలిపారు. గురువారం ఈ మేరకు స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ పురస్కారాలను విభిన్న రంగాల్లో ప్రతిభావంతులైన వారికి అందించారన్నారు. తనకు సామాజిక సేవా కార్యక్రమాల విభాగంలో అమెరికన్ యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ మధుకిషన్ చేతుల మీదుగా మెమెంటో, ప్రశంసాపత్రం అందజేశారన్నారు. ఆయన్ని పలువురు ప్రముఖులు అభినందించారు.

### సతీష్‌కుమార్‌కు డాక్టరేట్




డాక్టరేట్ అందుకుంటున్న సతీష్‌కుమార్

**సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం):** జీఎస్‌జే మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు చల్లగాని సతీష్‌కుమార్ సేవలు అభినందనీయమని ది అమెరికన్ యూనివర్సిటీ చాన్సిలర్, అంతర్జాతీయ శాంతి దూత మధుక్రిషన్ అన్నారు. చెన్నైలోని టి.నగర్ సోషల్ క్లబ్‌లో జరిగిన గ్లోబల్ పీస్ సమ్మిట్ 2023లో బుధవారం చల్లగాని సతీష్ కుమార్ గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. గురువారం ఆయనకు స్థానిక మినిస్ట్రీస్ కార్యాలయంలో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. సతీష్‌కుమార్ మాట్లాడుతూ జీఎస్‌జే మినిస్ట్రీస్ ద్వారా చేసిన సామాజిక సేవలకు ఈ డాక్టరేట్ అందుకోవడం ఆనందంగా ఉందన్నారు.

### పేద విద్యార్థినికి 'చందన' చేయూత



విద్యార్థిని ఆశాజ్యోతికి ఆర్థిక సాయం అందజేస్తున్న చందన నాగేశ్వర్

**రాజమహేంద్రవరం రూరల్:** పదో తరగతి విద్యార్థిని చదువుకు ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ చేయూత అందించారు. బొమ్మూరు లెప్రసీ కాలనీకి చెందిన ఆశాజ్యోతి పదో తరగతి చదువుతోంది. ఆమె తల్లి నోటి క్యాన్సర్, తండ్రి కాలికి ఇన్ఫెక్షన్‌తో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న చందన నాగేశ్వర్ ఆమె చదువుకు ఆర్థిక సాయం అందించడంతో పాటు, ఆ విద్యార్థిని చదువుకునేంత వరకూ సాయం అందిస్తానని భరోసా ఇచ్చారు. విద్యార్థిని ఆశాజ్యోతికి బుధవారం రాత్రి చందన ఆర్థిక సాయం అందించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### వెంకటనగరంలో పశు వైద్యశిబిరం



పశు వైద్య శిబిరంలో సేవలు అందిస్తున్న వెంకటేశ్వర్లు

**రాజమహేంద్రవరం రూరల్:** వెంకటనగరం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దీనిని వైఎస్సార్ సీపీ నేతలు మోతా రమేష్, కొల్లపు శ్రీను ప్రారంభించారు. నగర పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకుడు డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, అనపర్తి పశు సంవర్ధక శాఖ ఏడీ వై.శ్రీనివాసరావు, తొర్రేడు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ బి.జ్యోత్స్నలు పశువులకు వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 126 పశువులకు టీకాలు వేయడంతో పాటు 20 గేదెలకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు, 18 దూడలకు పాముల మందు, 76 కోళ్లకు మందులు పంపిణీ చేశామన్నారు. 80 జీవాలకు వివిధ రకాల మందులు అందజేమన్నారు. పంచాయతీ కార్యదర్శి చెరుకూరి రాణి, వెటర్నరీ అసిస్టెంట్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

**కడియం:** పొట్టిలంక గ్రామంలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు. ఈ విషయాన్ని గురువారం ఆ శాఖ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. వార్షిక మరమ్మతుల్లో భాగంగా 33 కేవీ చొప్పెల్ల– కడియపులంక ఫీడర్, 11 కేవీ పొట్టిలంక ఫీడర్లకు సరఫరా ఉండదన్నారు. దీంతో పొట్టిలంక గ్రామానికి సరఫరా నిలిచిపోతుందని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

# ప్రమాదాలకు బ్రేక్..

- ధవళేశ్వరం ఇండస్ట్రియల్ కాలనీ వద్ద రక్షణ చర్యలు
- బ్లాక్ స్పాట్‌గా పోలీసుల గుర్తింపు
- హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



ఇండస్ట్రియల్ కాలనీ సెంటర్ డివైడర్ వద్ద ఏర్పాటు చేసిన స్టాపర్ బోర్డులు

**ధవళేశ్వరం:** అతివేగం.. ఆపై రోడ్డు క్రాసింగ్ పాయింట్ కావడంతో నిత్యం అక్కడ ఏదో ఒక ప్రమాదం జరుగుతూండేది.. ఇప్పటికే చాలామంది ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. ధవళేశ్వరంలోని ఇండస్ట్రియల్ కాలనీ వద్ద జాతీయ రహదారిపై పరిస్థితి ఇది. ఇక్కడ జాతీయ రహదారి ప్రాంతాన్ని పోలీసులు బ్లాక్ స్పాట్‌గా గుర్తించారు. ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఇండస్ట్రియల్ కాలనీ సెంటర్ డివైడర్ వద్ద ప్రమాదాల నివారణకు పోలీస్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది.

**ఇక్కడే ఎందుకంటే..**

ధవళేశ్వరం గ్రామం నుంచి ఇండస్ట్రియల్ కాలనీకి వెళ్లాలంటే కొంచెం దూరం వాహనాలకు ఎదురెళ్లి రోడ్డు క్రాసింగ్ పాయింట్ వద్ద జంక్షన్ దాటాలి. తిరిగి అంతే దూరం ఎదురుగా వచ్చే వాహనాలను దాటుకుంటూ వెళ్తే కాలనీ వస్తుంది. కాలనీకి ఎదురుగా గ్రామంలోకి ప్రవేశించే రోడ్డు దాటే మార్గం లేక వచ్చిన సమస్య ఇది. అలాగే ధవళేశ్వరం నుంచి హార్లిక్స్ ఫ్యాక్టరీకి, ఇండస్ట్రియల్ కాలనీలోని పలు పరిశ్రమలకు ఉద్యోగులు వెళ్తుంటారు. అయితే వచ్చే సమయంలో వాహనాలకు ఎదురుగా వస్తుండడం ప్రమాదాలకు కారణమవుతోంది. ధవళేశ్వరం హార్లిక్స్ ఫ్యాక్టరీతో పాటు వివిధ ఫ్యాక్టరీలలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులు జాతీయ రహదారి పైనుంచే రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే హైవే కావడంతో అనేక మంది ఇలా వెళ్తుంటారు. ఇక్కడ రోడ్డు దాటుతున్న సమయంలో ఎదురుగా వస్తున్న వాహనాలు ఢీకొనడంతో ప్రమాదాలు జరగడం పరిపాటిగా మారింది. ఇలా మూడేళ్ల కాలంలో ఇక్కడ 20 మంది వరకూ మృత్యువాత పడ్డారు. క్షతగాత్రులు 50 మంది వరకూ ఉంటారు. ఈ ప్రమాదాలు ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగుల్చుతున్నాయి.

**పరిశీలించి.. చర్యలు చేపట్టి**

ఈ ప్రాంతాన్ని పోలీస్ యంత్రాంగం బ్లాక్ స్పాట్‌గా గుర్తించింది. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇటీవల జిల్లా ఎస్పీ జగదీష్ స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ ప్రాంతంలో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్టాపర్ బోర్డులను ఏర్పాటు చేయించారు. అదే విధంగా ప్రమాదకర మలుపు కావడంతో హెచ్చరిక బోర్డులు పెట్టారు. వాహనదారులు, స్థానికులకు ప్రమాదాల నివారణ చర్యలను వివరించారు. రద్దీ సమయంలో పోలీస్ సిబ్బంది పహారా కాస్తున్నారు. ప్రమాదాలను పూర్తిగా నివారించాలన్న లక్ష్యంతో పోలీసులు చర్యలు చేపట్టారు.



పోలీసు సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా ఎస్పీ జగదీష్ (ఫైల్)

**అదొక్కటే ఇబ్బంది**

ప్రమాదాల నివారణకు ఎన్ని చర్యలు చేపడుతున్నా ఇక్కడ రాత్రయితే అంధకారం అలముకుంటోంది. రాజమహేంద్రవరం వైపు నుంచి కిందకు వేగంగా వాహనాలు వస్తుంటాయి. కింది ప్రాంతంలో ఇండస్ట్రియల్ కాలనీ ఉండడంతో వేగంగా వచ్చే వాహనాలతో అక్కడి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇక్కడ జాతీయ రహదారిపై విద్యుత్తు వెలుగులు ఉంటే ప్రమాదాలను పూర్తిగా అరికట్టవచ్చని స్థానికులు అంటున్నారు. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

**జాగ్రత్తలు పాటించాలి**

ప్రమాదాలకు నిలయంగా మారిన ఇండస్ట్రియల్ కాలనీ సెంటర్ డివైడర్ వద్ద వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి. ఇక్కడ వేగంగా వాహనాలను నడపడం ప్రమాదకరం. అదే విధంగా డివైడర్ దాటేటప్పుడు వెనుక నుంచి వచ్చే వాహనాలను గమనించాలి. ఇండస్ట్రియల్ కాలనీ వద్ద ఉన్న బ్లాక్ స్పాట్ వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాం. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్టాపర్ బోర్డులను ఏర్పాటు చేశాం. అలాగే హెచ్చరిక బోర్డులు పెట్టాం.

– కె.మంగాదేవి, సీఐ, ధవళేశ్వరం

# మర్యాద పూర్వకంగా..



డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజును సత్కరిస్తున్న ముద్దాల అను

**రాజమహేంద్రవరం రూరల్:** రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల తిరుపతిరావు (అను) గురువారం ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజులను మర్యాద పూర్వకంగా వారి కార్యాలయాల్లో కలిశారు. ఈ సందర్భంగా వీర్రాజును సత్కరించారు. వైఎస్సార్ సీపీ దివ్యాంగుల సెల్ జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, నాయకులు పడాల వీరప్రసాద్, పిన్నమరెడ్డి సూర్యచంద్రం తదితరులు పాల్గొన్నారు.

### మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

**రాజమహేంద్రవరం రూరల్:** స్థానిక లాలాచెరువు ప్రాంతంలో గురువారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న దివాన్‌చెరువు గ్రామానికి చెందిన రేలంగి అన్నవరాన్ని అరెస్టు చేసినట్లు ఎస్‌ఈబీ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. అతని నుంచి 180 ఎంఎల్ పది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# 24 గంటల్లోనే బాధితులకు పరిహారం

- వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ నాగేశ్వర్



బాధితులకు నగదు పరిహారం అందిస్తున్న రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్, నాయకులు

**కడియం:** తుపాను కారణంగా నష్టపోయిన బాధిత కుటుంబాలకు 24 గంటలు తిరక్కుండానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నష్ట పరిహారం అందించారని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. మండలంలోని వేమగిరి, కడియం, దామిరెడ్డిపల్లి, దుళ్ల తదితర గ్రామాల్లో తుపాను కారణంగా ఇళ్లు దెబ్బతిన్న 9 మంది బాధిత కుటుంబాలకు ఒకొక్కరికి రూ. పది వేల చొప్పున గురువారం ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటైన కార్యక్రమంలో చందన మాట్లాడుతూ గత ప్రభుత్వాలకు, సీఎం జగన్ ప్రభుత్వానికి మధ్య తేడాను ప్రజలు గమనిస్తున్నారన్నారు. నష్టం జరిగిన వెంటనే బాధితులను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన జగన్‌ను ప్రజలు మర్చిపోలేరన్నారు. ఇళ్లలోకి నీరు చేరిన ఎనిమిది కుటుంబాలకు బుధవారమే బియ్యం, కందిపప్పు, కూరగాయలను ప్రభుత్వ సాయంగా అందజేశామన్నారు. ఇప్పుడు ఇళ్లు దెబ్బతిన్న కుటుంబాలకు సాయం చేశామన్నారు. గత టీడీపీ ప్రభుత్వం నివేదికలు అంటూ కాలం వెళ్లదీసి ఆరునెలలకో, ఏడాదికో అరకొర సాయం అందించేదని గుర్తు చేశారు. అందుకు భిన్నంగా ప్రకృతి విపత్తుల సమయంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంతో పాటు, ఎప్పటికప్పుడు ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలిగినా తక్షణం ఆదుకునే విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అంతే కాకుండా నష్ట పరిహారం కూడా వెంటనే అందించిందన్నారు. ఇంకా బాధితులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. అనంతరం బాధితులకు నగదు సాయం అందించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), మండల పార్టీ అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, నాయకులు ఊటుకూరి శైలజ, శాకా పట్టాభి, రాణా హరిశ్చంద్ర, తహసీల్దార్ ఎం.సుజాత, ఆయా గ్రామాల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**రూరల్ మండలంలో..**

**రాజమహేంద్రవరం రూరల్:** తుపాన్‌లో దెబ్బతిన్న ఇళ్ల బాధితులకు నష్ట పరిహారాన్ని వేగంగా అందించామని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. బొమ్మూరులోని రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో మండలంలో దెబ్బతిన్న ఇళ్ల బాధితులు 13 మందికి ప్రభుత్వం ద్వారా రూ.10 వేల చొప్పున నష్ట పరిహారం ఆయన అందజేశారు. తహసీల్దార్ పైడి చిన్నారావు, డిప్యూటీ తహసీల్దార్ రత్నసాగర్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను తదితరులు పాల్గొన్నారు.

# నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి



జేగురుపాడులో లిల్లీ తోటల రైతులకు సూచనలు ఇస్తున్న డీవీఎస్ రాజు తదితరులు

**కడియం:** తుపాను ప్రభావంతో పడిన వర్షాలకు చేలల్లో చేరిన ముంపు నీటిని మళ్లించుకోవాలని వేమగిరిలోని డివిజనల్ ఫ్లోరికల్చర్ రీసెర్చ్ సెంటర్ (డీఎఫ్‌ఆర్‌సీ) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డీవీఎస్ రాజు అన్నారు. గురువారం ఆయన తమ శాస్త్రవేత్తల బృందం, ఉద్యాన శాఖ అధికారులతో కలసి కడియం మండలం జేగురుపాడు, పొట్టిలంక, వీరవరం గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లోని కూరగాయలు, పువ్వుల తోటలు, నర్సరీలు తదితర ఉద్యాన పంటలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. వర్షాలు తగ్గిన వెంటనే 19.19.19 లేదా 13.0.45 వంటి పోషకాలను పంటపై పిచికారీ చేసుకోవాలన్నారు. అవసరాన్ని బట్టి సూక్ష్మపోషకాలను కూడా అందించాలన్నారు. లిల్లీ తోటల నుంచి నీటిని పూర్తిగా తీసివేసి, ఆకుమచ్చ తెగులు నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ లీటరు నీటికి రెండు గ్రాములు, ప్లాంటామైసిన్ రెండు గ్రాములు లీటరు నీటికి, బొరాక్స్‌ను కూడా పిచికారీ చేయాలన్నారు. తద్వారా పంట నష్టం తగ్గించుకోవచ్చన్నారు. శాస్త్రవేత్త మాధవన్, రాంపాల్, కడియం హెచ్‌ఓ డి.సుధీర్‌కుమార్, ఉద్యాన విస్తరణాధికారి శివగణేష్, గ్రామ ఉద్యాన సహాయకులు కోటేశ్వరరావు, సుధీర్ పాల్గొన్నారు.

### బాలరాజుకు పరామర్శ



బాలరాజును పరామర్శిస్తున్న ముద్దాల అను

**ధవళేశ్వరం:** పితృ వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీరంగం బాలరాజును గురువారం రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా బాలరాజు తండ్రి సత్యనారాయణ చిత్రపటానికి నివాళులు అర్పించారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు బాలరాజును పరామర్శించిన వారిలో ఉన్నారు.

# క్రీస్తు బోధనలు అనుసరణీయం



బెస్టీ విలియమ్స్‌ను సత్కరిస్తున్న మార్టిన్ తదితరులు



క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న పరంజ్యోతి, చిత్రంలో బిషప్ ప్రతాప్‌సిన్హా

**సీటీఆర్‌ఐ:** క్రీస్తు బోధనలు అనుసరణీయమని ఎస్‌సీవైఏ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ బెస్టీ విలియమ్స్ అన్నారు. గురువారం రాత్రి స్థానిక మున్సిపల్ కాలనీలోని సెయింట్ జాన్స్ చాపల్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న బెస్టీ విలియమ్స్ మాట్లాడుతూ క్రీస్తు బోధనలతో సామాజంలో శాంతి నెలకొంటుందన్నారు. అంతా కలసిమెలసి సమానత్వంతో ముందుకు సాగాలన్నారు. అనంతరం చెవిటి, మూగ పిల్లలకు కేక్‌లను పంచారు. కార్యక్రమంలో రెవరెండ్ గులాల మార్టిన్, ఆలమూరి సునీల్, స్వరూప్, తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా క్రిస్మస్ వేడుకలు**

**రాజమహేంద్రవరం రూరల్:** హుకుంపేట డి–బ్లాకులోని రెవ రూపస్ ప్రార్థన మందిరంలో గురువారం రాజమహేంద్రవరం రూరల్ రీజినల్ ఫెలోషిప్ క్రిస్మస్ వేడుకలను రీజినల్ చైర్మన్ రెవరెండ్ డి.పరంజ్యోతి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బిషప్ ప్రతాప్‌సిన్హా, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్, ఎం.కరుణాకర్, కోశాధికారి టాటావిక్టర్, జాయింట్ సెక్రటరీ సుకుమార్, ఎం.సాల్మన్, జాన్‌డేవిడ్ పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్యాండిల్ సర్వీస్, కేక్ కటింగ్ అనంతరం బిషప్ ప్రతాప్‌సిన్హా క్రిస్మస్ సందేశం అందించారు. కొంతమూరు, హుకుంపేట, శాటిలైట్‌సిటి, ధవళేశ్వరం, కడియం గ్రామాల నుంచి 500 మంది సేవకులు వేడుకల్లో పాల్గొన్నారని పరంజ్యోతి తెలిపారు. సంఘ కాపరి రెవ.రూపస్ సంఘం చక్కని ఏర్పాట్లు చేయడంతో పాటు ప్రేమ విందును ఏర్పాటు చేసిందన్నారు.

### శబరిమలైకు ప్రత్యేక బస్సులు



శబరిమలై బయలు దేరిన బస్సుల వద్ద భక్తులు

**రాజమహేంద్రవరం సిటీ:** శబరిమలై అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లే భక్తులకు అతి తక్కువ ధరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆర్టీసీ డీపీటీఓ షర్మిల అశోక తెలిపారు. రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి 72 మంది అయ్యప్ప భక్తులతో శబరిమలై బయలు దేరిన రెండు బస్సులను ఆమె ప్రారంభించారు. ఈ బస్సు ప్రయాణం 8 రోజుల పాటు ఉంటుందన్నారు. శబరిమలకు ప్రత్యేక బస్సులు అవసరమైన భక్తులు జిల్లాలోని రాజమహేంద్రవరం, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు ఆర్టీసీ డిపోల్లో సంప్రదించాలన్నారు. గురువారం గోకవరం నుంచి 2, రాజమహేంద్రవరం నుంచి 2, కొవ్వూరు నుంచి 2 బస్సులు బయలుదేరి వెళ్లాయన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ షేక్ షబ్నం తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛత దిశగా అడుగులు

- పారిశుధ్య పనులు ముమ్మరం



చర్చిపేటలో పారిశుధ్య పనులు చేపట్టి బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

**రాజమహేంద్రవరం సిటీ:** తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు పారిశుధ్య సమస్య తలెత్తకుండా పనులను అధికారులు ముమ్మరం చేశారు. స్వచ్ఛత దిశగా అడుగులు వేస్తున్నారు. నగర ప్రజలకు అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. ముంపు ప్రాంతాల్లో దోమలు ప్రబలకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని ఆరోగ్య విభాగానికి ఆదేశాలివ్వడంతో ప్రక్షాళన చర్యలు చేపట్టారు. ప్రతి డివిజన్‌లో బ్లీచింగ్ చల్లుతున్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముంపు ప్రాంతాలైన కోటిలింగాల పేట, ఆర్యాపురం, కృష్ణానగర్, ఆదెమ్మదిబ్బ, రామచంద్రరావు పేట, పేపరుమిల్లు ఏరియా, ఆల్కాట్‌తోట తదితర చోట్ల ప్రత్యేక పారిశుధ్య పనులు చేయిస్తున్నారు.

# చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



విభిన్న ప్రతిభావంతులకు కేక్ తినిపిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూషకుమారి

**కంబాలచెరువు:** స్థానిక తాడితోటలోని భవిత ఉప కేంద్రంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల వారోత్సవాల్లో భాగంగా గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల హక్కుల చట్టం –2016 తదితర వాటి గురించి వివరించారు. ఈ చట్టాలు, హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన పొందాలన్నారు. విభిన్న ప్రతిభావంతులు అనేక రంగాల్లో రాణిస్తున్నారని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిని ప్రోత్సహించాలన్నారు. వీరికి సదరమ్ సర్టిఫికెట్లు, సంక్షేమ పథకాలు, వైద్య చికిత్సల విషయంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ సహకరిస్తుందన్నారు. భవిత ఉప కేంద్రంలోని సదుపాయాలు, పిల్లలకు మానసిక ఎదుగుదలకు తోడ్పడే ఉల్లాసభరితమైన శిక్షణ కార్యకలాపాలు బాగున్నాయన్నారు. అనంతరం న్యాయమూర్తి పిల్లలతో కేక్ కట్ చేయించారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్‌కుమార్, సమగ్ర శిక్ష అకౌంట్స్ ఆఫీసర్ జె.స్నేహలత, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ కె.మధు, ఎస్.వి.ఆర్. మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం కె.డేవిడ్ లివింగ్‌స్టన్ తదితరులు పాల్గొన్నారు.

### మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



రాజానగరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద మొక్కలు నాటుతున్న సిబ్బంది

**రాజానగరం:** స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు ప్రాంగణంలో పచ్చదనం– పరిశుభ్రతలో భాగంగా కార్యాలయ, అంగన్‌వాడీ సిబ్బంది గురువారం వివిధ రకాల మొక్కలను నాటారు. వాయు కాలుష్య నివారణలో చెట్ల ప్రాముఖ్యత గురించి సీడీపీఓ టి.నాగమణి వివరించారు. మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. తమ ప్రాజెక్టు కార్యాలయం వద్దే కాకుండా అంగన్‌వాడీ కేంద్రాల వద్ద కూడా మొక్కల పెంపకానికి శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి సూచించామన్నారు.

# టీడీపీ తప్పిదంతోనే ముంపు సమస్య

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- అధైర్య పడవద్దని రైతులకు భరోసా
- బొబ్బిల్లంక– మిర్తిపాడు కల్వర్టు తొలగింపు



మిర్తిపాడు– బొబ్బిల్లంక కల్వర్టు వద్ద రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

**సీతానగరం:** టీడీపీ తప్పిదం కారణంగానే రైతులు నష్టపోతున్నారని, మిర్తిపాడు– బొబ్బిల్లంక తొర్రిగడ్డ కాలువపై కల్వర్టు వల్లే పంట పొలాలు ముంపులోకి వెళ్తున్నాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. మిచాంగ్ తుపాన్‌తో కురిసిన వర్షాలకు సీతానగరం, కోరుకొండ మండలాల్లో పంట పొలాలు ముంపులోకి వెళ్లాయి. పంట పొలాల నుంచి నీరు తొర్రిగడ్డ కాలువ మీదుగా వెళ్లాల్సి ఉంది. అయితే గత టీడీపీ హయాంలో కల్వర్టు నెలకొల్పి దాని కింద వైశాల్యం తక్కువ ఉన్న తూరలు ఏర్పాటు చేశారు. దీంతో తూరలకు చెత్త అడ్డుపడి నీరు వెళ్లడం లేదు. ఫలితంగా పంట పొలాల్లో వర్షం నీరు లాగక రైతులకు తీరని నష్టం జరుగుతోంది. గురువారం రఘుదేవపురం, ఉండేశ్వరపురం, కాటవరం, మిర్తిపాడు, బొబ్బిల్లంక, కోరుకొండ మండల బుచ్చింపేట, ములగాడ, గుమ్ములూరు తదితర గ్రామాల నుంచి సుమారు నాలుగు వందల మంది రైతులు కల్వర్టు వద్దకు తరలివచ్చారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు వారు సమాచారం అందించగా హుటాహుటిన చేరుకుని రెండు పొక్లెయిన్‌లను రప్పించి కల్వర్టును తొలగించే పనులు చేపట్టారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ టీడీపీ హయాంలో నిర్మించిన కల్వర్టుతో రైతులు నష్టపోతున్నారని, దీనిని తొలగించి ఎత్తులో బ్రిడ్జి నిర్మాణానికి సంబంధిత శాఖ ద్వారా నివేదిక పంపించామని, రూ.3.50 కోట్ల నిధులు కేటాయించారన్నారు. త్వరలో కల్వర్టు పనులు చేపడతామన్నారు. రైతులకు నష్టం కలిగించే విధంగా ఉన్న కల్వర్టును తొలగించి, ముంపు నుంచి పొలాలకు విముక్తి కల్పించామన్నారు.

### యువకుడి అదృశ్యం

**రాజమహేంద్రవరం రూరల్:** ఇంటి నుంచి వెళ్లిన తన కుమారుడు ఇప్పటి వరకూ తిరిగి రాలేదని హుకుంపేట రామకృష్ణనగర్‌కు చెందిన సారా గ్రేస్ గురువారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. హుకుంపేట రామకృష్ణనగర్‌కు చెందిన కె.పాల్‌డేనియల్(26) ఇంటి నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లి వస్తుంటాడు. ఈ ఏడాది నవంబర్ 22న ఇంటి నుంచి వెళ్లిన తన కుమారుడు ఇప్పటి వరకూ రాలేదని గ్రేస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## సాక్షి-సినిమా




| | |
|---|---|
| శ్యామల: | యానిమల్ |
| సూర్యమినీ: | యానిమల్ |
| సూర్యప్యాలెస్: | హాయ్ నాన్న |
| స్వామి: | హాయ్ నాన్న |
| శివజ్యోతి: | ఎక్స్‌ట్రా ఆర్డినరీమేన్ |
| అనుశ్రీ: | హాయ్ నాన్న |
| రాజా: | హాయ్ నాన్న |
| అశోక: | ఎక్స్‌ట్రా ఆర్డినరీమేన్ |
| ఊర్వశి: | కోటబొమ్మాళి పీఎస్ |
| రంభ: | మంగళవారం |
| మేనక: | చాందిక |
| అప్సర: | ఎక్స్‌ట్రా ఆర్డినరీమేన్ |
| **నామవరం:** | |
| వీఎస్ మహల్: | హాయ్ నాన్న, ఎక్స్‌ట్రా ఆర్డినరీమేన్ |
| **ధవళేశ్వరం:** | |
| మురళీకృష్ణ: | హాయ్ నాన్న, ఎక్స్‌ట్రా ఆర్డినరీమేన్ |
| **కడియం:** | |
| వెంకటసూర్య: | హాయ్ నాన్న, ఎక్స్‌ట్రా ఆర్డినరీమేన్ |